# సరసుడి పెళ్లి ముచ్చట

పి. సరళా దేవి

స్కెచ్

అరగంటక్రితం తనకు బావగా మారిన పెళ్ళి కొడుకు వీరభద్రానికి కాఫీ, టిఫేను తీసుకొస్తూ కుర్చీ ఖాళీగా వుండడంచూచి 'నాన్నా' అని ఓ పొలికేక పెట్టి వీధిలోకి పరిగెత్తాడు గణపతి. కొడుకు పెట్టిన గావుకేక వినేసరికి రామసుబ్బయ్యకు ముచ్చెమటలు పోశాయి. ఒక్క వురుకున వీధిలో కొచ్చి దిగాలుపడి ఎటో చూస్తున్న కొడుకుని చూచి, అటే చూశాడు.

ఇంకేముంది? పెళ్ళికొడుకు వీధికి ఆ చివరవున్న విడిదింటికి అప్పుడే దగ్గరపడిపోయాడు.

"ఓరి వెధవా! ఇంకా నిల్చునే వున్నావేంరా? పద పద" ఖంగారుగా అనేశాడు.

చేతిలోవున్న కాఫీ టిఫేను అక్కడే అరుగు మీద పడేసి, వీధిలోకి పరుగెత్తడంలో తన చొక్కామీద ఒలికిన కాఫీని తుడుచుకుంటూ తండ్రివెంట పడ్డాడు గణపతి.

ఇద్దరూ ఉరుకులు పరుగులుగా వచ్చారు. కాని అంతలోకే పెళ్ళికొడుకు గదిలోకి వెళ్ళిపోయి దబాలున తలుపు వేసుకున్నాడు. ఎవరికీ అర్థంకాలేదు. ఏదో కొంపమునిగిందే! పోనీ ఏదో తెలుసుకుందామన్నా తనకంటే వింతగా తెల్లబోయి చూస్తున్నారు-వియ్యంకుడు, వియ్యపురాలు. పెళ్ళివాళ్ళంతా ఒకళ్ళమొగా లొకళ్లు చూసుకున్నారు. రామసుబ్బయ్యకి నోటమాటలేదు.

అమ్మగా ముందు తెలుసుకోవలసిన బాధ్యత తనమీదుంది కాబట్టి, గోవిందమ్మే ధైర్యంచేసి తలుపుతడుతూ "భద్రం నాయనా...ఏమిటిరా? తలుపు తియ్యరా...ఏమొచ్చిందిరా? ఏంకావాలి? అడగంది అమ్మ మాత్రం పెడుతుందటరా?... మా బాబువికదూ! తియ్యరా...మీ అమ్మకి చెప్పడానికేంరా?" అంటూ నోటికొచ్చినవన్నీ వల్లించినా లోపలినించి ఏ శబ్దమూ రాలేదు.

రామసుబ్బయ్య ప్రక్కకి తిరిగి "మెల్లిగా మేమేదో కనుక్కొని తీసుకొస్తాం. మీరువెళ్ళండి" అన్నాడు. ఇంక చేసేదిలేకవచ్చి వీధరుగుమీద కూలబడ్డారు రామసుబ్బయ్యా, గణపతీ.

వాళ్లు వెళ్ళిపోయినట్టుగా తెలుసుకొని మరి కొంతసేపు మురిపించి పిడుగు పడినట్టు విసురుగా తలుపుతీశాడు వీరభద్రం. ఆ శబ్దానికి ఓ పసిపిల్ల గుక్కపట్టింది.

"ఇలాగేనా చేసుకుంటారు? బుద్ధీ జ్ఞానం ఉండక్కర్లా...మళ్ళీ కొండంత మాట్లాడుతారు. మంచి మర్యాదా ఉండొద్దూ. పెళ్ళికొడుక్కి చేయవలసిన మర్యాద ఇదేనా అంట...వీళ్ళని ఇలా ఎండగట్టి వాళ్ళలా పచార్లు కొడతారా? మనుషులా..." విసురుగా వాగేస్తూ అలసిపోయి ఓ పెట్టిమీద కూలబడ్డాడు అమ్మా, నాన్నా ఒకర్నొకరు తెల్లబోయి చూచుకోడం ఓకంట కనిపెడుతూ. గోవిందమ్మా వెంకట్రామయ్యా దగ్గరికొచ్చి కూర్చున్నారు.

"ఏం జరిగిం..." వెంకట్రామయ్య మాట పూర్తికాలేదు.

"—ఇంకా ఏం జరగాలి? ఆకలితో చస్తూంటే. పెళ్ళయి అరగంట దాటింది - దాహానికి మంచి నీళ్ళిచ్చే దిక్కు లేదుకదా. పోనీ కదా అని అన్నిటినీ సహిస్తూంటే ఘాతరు లేకపోతోంది."

ఎంతత్వరగా పరుగెత్తి తీసుకొచ్చాడో, కాఫీ టిఫేను లోపలికి పంపించాడు గణపతి. కాళ్ళ దగ్గర కొచ్చిన కాఫీ టిఫేనుచూసి, బావా, మామగారూ ఇక్కడే వున్నట్లుగా గ్రహించాడు వీరభద్రం. తన పిచ్చిగాని అల్లుని అలక తీర్చకుండా మామగారు మంచి నీళ్ళయినా తాగగలడా?

"నాకేమక్కర్లేదు. ఇదికూడా వాళ్ళనే మెక్కమను. ఇప్పుడు కాబోలు తెలిసింది. మర్యాద తెలీని మనుషులు" ఎడంచేతి ప్రక్కనున్న పెట్టెమీది పరుపుకి పీపానించి ప్రక్కకు తిరిగి పెడమొగం పెట్టాడు.

"ఇదేం గొడవరా? ఏదో సాఫీగా జరిగిపోతోం దనుకుంటే..."

"అదేనమ్మా! అదే. అందరి పెళ్ళిళ్ళలో ఏదో ఒక గొడవ జరుగుతూంటుంది. మన పెళ్ళి ఎందుకు సాఫీగా జరిగిపోవాలని...అనుకుంటున్నారు. మన మెంత సర్దుకుపోతున్నా వాళ్ళకి మన లక్ష్యం లేకపోతోంది. అసలు నాకు పేంటుకి బట్ట ఏదమ్మా? నా మొగాన్న ఆ పట్టుపంచల చాపు కొట్టారు. ఇప్పటివాళ్ళు పట్టుపంచ కడతారా? ఆమాత్రం తెలివిలేకపోతే..."

"అదేవిట్రా? పెళ్ళిలో పంచెలచాపు ఇవ్వాలి కట్టినా కట్టకపోయినా."

"నీ చాదస్తం మరీనమ్మా! ఇలాంటి చాదస్తా లన్నీ పెట్టుకునే మూడు గంటలసేపు పీటలమీంచి లేవనియ్యలేదు. నడుం వంగిపోయింది. ఓ కుర్రకుంక ఎవడోవచ్చి ఉల్లిపాయల దండ మెళ్ళోవేశాడు. నేను చూడలేదుగాని, అక్కడే చెంప ఛెళ్ళుమని పిద్దును. ఆ మంగళహారతి పాట చూశావా? వెధవ పాట. వెధవ వేడుకలూను. గాడిదమీద నన్నూ రేగిస్తారట. ఛీ. ఛీ. ఆ హారతి పళ్ళెం మొగాన కొట్టివచ్చేదామనుకున్నాను. మళ్ళీ పాట పాడుతూ తెగ నవ్వేసుకుంటున్నారు సిగ్గులేని మొహాలు!" ఎవరికీ మాటలాడడానికికూడా సందు లేకపోతోంది.

వెంకట్రామయ్యగారు తీరిగ్గా చుట్ట కాల్చుకుని వింటున్నారు. గోవిందమ్మ మాత్రం అవతలినించి వాళ్లు ఈ మాటలన్నీ వింటున్నారే అని గాబరా పడుతోంది. వింటున్న అందరి మొగాల్లోనూ క్వశ్చన్ మార్కే. పీటలమీద అంచక్కా నవ్వుతూ కూర్చున్నాడు, అప్పుడు లేనికోపం ఇప్పుడెలా వచ్చిందా అని.

"ఇంటావంటా లేనికోపం నీకెలా అంటిందిరా? అవన్నీ పెళ్ళి ముచ్చట్లురా!"

"పెళ్ళికొడుకుని చంపుకు తినడమే పెళ్ళి ముచ్చట్లు కాబోలు. పెళ్ళికూతుర్ని మాత్రం కంది పోతుందేమో అన్నట్లు చూస్తున్నారు. ఆఖరికి తలుపుదగ్గర పేరు చెప్పకపోయినా సర్దేశారు."

"పుస్తెకట్టినతరువాత ఏమిటీ అల్లరి. ఏదోజరిగి పోయిందిలే. పెళ్ళింట్లోంచి ఇలా పరుగెత్తుకు వచ్చేస్తే బావుంటూదా? పద. పద." గోవిందమ్మ పర్దిందిం.

"పద పద మన వూరికి. పెట్టే, బేడా సర్దండి. మీరు రాకపోయినా నేనొక్కణ్ణే పోతాను." లేచి బట్టలు పెట్టెలో వెయ్యడం మొదలు పెట్టాడు.

"ఇదేం మనిషివిరా? గోరంతలు కొండంతలు చేస్తున్నావు. ఈ ఒక్కపూటా కళ్ళుమూసుకో! రేపటికి అన్నీ అయిపోతాయి, వెళ్ళిపోవచ్చు."

"మీ కంత మోజుగావుంటే వుండండి. నేను మాత్రం ఒక్క నిముషం ఉండను." పెట్టెమూత నొక్కి తాళం వేసేశాడు. ఇంకేం వింటాడు రామసుబ్బయ్య, లోపలికి పరుగెత్తుకొచ్చాడు.

"ఈ అకారణకోపం ఏమిటి? మా వల్ల ఏదైనా తప్పు జరిగుంటే క్షమించి ఇంటికిరా బాబూ!" అని బ్రతిమాలుతూ చేతులుపట్టుకున్నాడు. స్వయానా మామగారొచ్చి పిలవగానే శాంతపడి పెట్టెమీద కూర్చుని—

"మీ రెవరు పిల్చినా రాను. పెళ్ళికూతు రొచ్చి పిలిస్తే వస్తాను." అనేసి సిగ్గుచేతనేమో చూపులు గోడమీద ఆనించి పెదవులు పంటితో నొక్కిపట్టాడు వీరభద్రం.

ఆమాట వినగానే రామసుబ్బయ్య వియ్యపు రాలివైపు, వియ్యంకుడివైపు వింతగా చూశాడు. వాళ్ళిద్దరూ ఒకరొన్కరు ముసిముసి నవ్వులతో చూసుకున్నారు. పెళ్ళివాళ్ళలో ముసిలమ్మలు ఇదెక్కడి విడ్డూరమా అని బుగ్గలు నొక్కు కున్నారు. పడుచువాళ్ళు మహా తమకర్థమైనట్లు, కళ్ళతో మాట్లాడుకుంటూ నోటికి గుడ్డ లడ్డం పెట్టుకుంటున్నారు.

"ఇదేం విడ్డూరంరా? శోభనంకాకుండా పెళ్ళి కూతురెలావచ్చి పిలుస్తుందిరా?" గోవిందమ్మ నవ్వుతూ కొడుకు మొగం చూచింది.

"మీరు వెయ్యి చెప్పినా, లక్ష చెప్పినా నాదొక్కటే మాట" మోకాళ్ళకి చేతులు బిగించుకున్నాడు.

మరి లాభంలేదని రామసుబ్బయ్య ఇంటికి బయలుదేరాడు. కొద్ది నిముషాల్లోనే ఇద్దరు ముత్తయిదువల మధ్య నడచివస్తున్న పెళ్ళికూతుర్ని చూసి "రంభా, ఊర్వశీ, తిలోత్తమాదేవియో" అను కున్నాడు వీరభద్రం.

ముత్తయిదువ లిద్దరూ చెరోరెక్కా పుచ్చుకుని వీరభద్రందగ్గరగా నిలబెట్టారు పెళ్ళికూతుర్ని. "అడగవే అన్నపూర్ణా" అన్నారు బుజంమీద గోలుకుతూ. పాపం, ఆపిల్ల సిగ్గుతో తలే ఎత్తదు.


"అందరూ అవతలికి పదండర్రా ఆపిల్లే అడుగుతుంది" అంటూ గోవిందమ్మ అందర్నీ బయటికి లాక్కొచ్చింది.

ఎవరూ లేకపోవడం క్రీగంటిచూపుతో చూచి అతని పాదాలముందు కూలబడింది అన్నపూర్ణ. ఎలా అడుగుతుందో చూద్దామనే మోకాళ్ళప్పగించి చూస్తున్నాడు వీరభద్రం.

మెల్లిగా రెండుచేతులతోనూ అతని కుడిచెయ్యి పట్టుకుని, జాలిగా అతని కళ్ళల్లోకి చూస్తూ "రారూ!" అంది. కాని అది గొంతులోనే వుండిపోయింది. అతను చిన్నినవ్వు నవ్వేసరికి తల వాలిపోయింది. ఎడమచేతితో ఆమె గడ్డం పట్టుకుని తలెత్తి కళ్లల్లోకి చూస్తూ "పద" అన్నాడు వీరభద్రం.

ఆమె మొగం అంతయిపోయింది. వయ్యారంగా లేచింది. అతని చేతిని అలాపట్టుకునే గది దాటింది. వీరభద్రం అందరి ప్రక్కా చూచి నవ్వుతూ అత్తింటికి బయలుదేరాడు. అందరూ కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయారు. వాళ్ళిద్దరూ వీధిగుమ్మం దాటగానే ఓ అబ్బాయి వీరభద్రం చెవిలో గబగబా గొణిగాడు: "మొత్తానికి నువ్వే గెల్చావురా శోధనం కాకుండానే పెళ్ళికూతుర్ని రప్పించుకుని. ఇంతకీ పెళ్ళికూతురు ముందు మాట్లాడిందో లేదో తెలియదు."

ఆ మాటలు వినగానే చటుక్కున తలెత్తి ఆ అబ్బాయిని చూచి, వెంటనే చురచురా వీరభద్రం కళ్ళల్లోకి చూచింది అన్నపూర్ణ. వీరభద్రం నవ్వేసరికి తలవంచుకొని గబగబా అడుగువేసింది. ఆమెతోపాటు వీరభద్రం కూడా అడుగువేశాడు. వాళ్ళని కలుసుకోడానికి ముత్తయిదువలు ఆయాసంగా రొప్పుతూ అడుగులు వేశారు. ★




"ఇవాళ ప్రజల్లో డబ్బుమీద వ్యామోహం తప్ప యింకో ఆలోచన లేదు. ప్రతి పనీ అందుకే చేస్తున్నారు. ఆఖరికి నిద్రలో కూడా డబ్బు గురించే కలలు కంటున్నాడు."—రాజాజీ ఉవాచ.